క్లుప్తంగా

చైతన్యలో స్పోర్ట్స్ మీట్



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న సీఐ

కదిరి అర్బన్: పట్టణంలోని చైతన్య పాఠశాలలో పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఇషాక్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆవుల అపహరణ

తనకల్లు: మండల పరిధిలోని గందోడివారిపల్లిలో రెండు పాడి ఆవులు అపహరణకు గురైనట్లు బాధిత రైతులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.. వివరాలు.. గ్రామానికి చెందిన సోమశేఖర్, రమేష్‌బాబు మంగళవారం రాత్రి తమ ఆవులు ఇంటి బయట కట్టి నిద్రపోయారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ఐచర్ వాహనంలో రెండు ఆవులను తీసుకొని వెళ్లిపోయారని వాపోయారు. ఒక్కో ఆవును రూ. 60 వేలు పెట్టి కొన్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

కుర్చీల వితరణ

నల్లచెరువు: మండలంలోని పాలపాటిదిన్నె ఆలయానికి కర్నూలు ఆర్టీఓ మల్లికార్జునరెడ్డి బుధవారం 100 కుర్చీలను అందజేశారు. తొలుత ఆర్టీఓకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవిరింటి భాస్కర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను చేశారు. తీర్థప్రసాదాలను అందించారు.

గుండెపోటుతో ఆర్టీసీ ఉద్యోగి మృతి

కదిరి అర్బన్: ధర్మవరం ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కదిరి మారుతీ నగర్‌లో నివాసం ఉండే లక్ష్మీ శంకర్‌రెడ్డి (50) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇతని స్వగ్రామం తలుపుల మండలం సిద్ద గూరిపల్లి. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మీశంకర్‌రెడ్డి మృతికి కదిరి ఆర్టీసీ డిపో డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ మేనేజర్‌లు హరి మోహన్, హరితతో పాటు పలువురు ఉద్యోగులు సంతాపం తెలిపారు.

గడ్డివామి దగ్ధం

తనకల్లు: మండల పరిధిలోని పడమటివారి పల్లిలో రమణారెడ్డికి చెందిన గడ్డివామికి మంటలు అంటుకోవడంతో దగ్ధమైంది. రమణారెడ్డి తన పశువులకు మేత కోసం గ్రామ సమీపంలోని చింతతోపులో వేరుశనగ గడ్డివామిని ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఏ జరిగిందో తెలియదు కానీ బుధవారం గడ్డివామి మొత్తం అగ్నికి ఆహుతైంది. దీంతో దాదాపు రూ. లక్ష వరకు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

సేవాభావంతో పని చేస్తే మంచి గుర్తింపు



నారాయణమ్మను సన్మానిస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: సేవా భావంతో పని చేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయమ్మ, లక్ష్మీదేవమ్మ అన్నారు. మండలంలోని చౌడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మ బుధవారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభకు ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరై ఆమెను సన్మానించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాము (ఫైల్)

పుట్టపర్తి: బుక్కపట్నంకు చెందిన చింతకాయల రాము అనే వ్యక్తి ఫిబ్రవరి 27న అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. బుధవారం ఎస్‌ఐ నరసింహుడు తెలిపిన వివరాల మేరకు.. రాము సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య పార్వతమ్మ, బంధువులు చుట్టుపక్కల ఎంత వెతికినా కనపడలేదు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాము మానసికస్థితి కూడా సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిస్కెట్ కలర్ చొక్కా, నీలిరంగు లుంగీ ధరించినట్లు తెలిపారు. ఎవరికైనా తెలిస్తే 9440901875 నంబరును సంప్రదించాలని, లేదా నేరుగా స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

• ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొడ్డువెలగల, కటారుపల్లి, గాండ్లపెంట గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు, గృహ సారథులతో బుధవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే శాసనమండలి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.రామచంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. నమూనా బ్యాలెట్‌లను చూపించి ఓటర్లలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను సైతం గుర్తించి ఫోన్ ద్వారా సమాచారం అందించి పోలింగ్‌కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖర రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాస్కరరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ,బీసీ కన్వీనర్ లక్ష్మీనరసింహగౌడ్, వీసీఎస్‌ఆర్‌ఐ విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ: గాజులవారిపల్లి పెద్దతండాకు చెందిన ఉపాధ్యాయుడు బుక్యా గోపాల్‌నాయక్(49) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి.. మృతుని స్వగ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. మృతునికి భార్య అమృత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని 3,4,5,35వ వార్డుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు,గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలపరచిన రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి,ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి వారి తొలి ప్రాధాన్యతా ఓటును మన అభ్యర్థులకే వేసేలా కృషి చేయాలన్నారు. ప్రతి ఓటరును ఒకటికి రెండు సార్లు కలిసి చైతన్యపరచాలన్నారు. సమన్వయంతో పనిచేసి పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీసీఎస్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,గృహసారథులు పాల్గొన్నారు.

మట్టికుండలు రెడీ..



ఓడీ చెరువు సంతలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మట్టికుండలు

ఓడీ చెరువు: వేసవిలో మట్టికుండల్లో మంచినీటిని నిల్వ చేసుకుంటే చల్లగా ఉంటాయి. తాగడానికి ఈ నీరు ఎంతో శ్రేష్టం. రిఫ్రిజిరేటర్లు, వాటర్ కూలర్లు ఉన్న వారు సైతం మట్టి కుండల్లో నీటిని తాగడానికే ఇష్టపడతారు. ఈ నేపథ్యంలో ఏ.ఎర్రబల్లిలోని పలు కుటుంబాలు కుండలు తయారు చేసి విక్రయించి జీవనం చేస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ఇంటి నిండా కుండలు తయారు చేసి సిద్ధం చేస్తున్నారు. తయారు చేసిన కుండలను వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో కుండ రూ. 70 నుంచి రూ. 100, రూ.120 వరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలంలో రెండు మూడు నెలల పాటు ప్రతి బుధవారం ఓడీ చెరువు, గురువారం మహమ్మదాబాద్, శుక్రవారం కొండకమర్ల, సోమవారం గోరంట్ల సంతలకు తయారు చేసిన కుండలను తరలించి విక్రయిస్తున్నట్లు గ్రామానికి చెందిన సోమశేఖర్, వెంకటరమణ తదితరులు చెబుతున్నారు. గతంలో మట్టి కుండలకు అధిక ప్రాధాన్యత వుండేదని ప్రస్తుతం వేసవిలో మాత్రమే కుండనీరు తాగేందుకు ఇష్టపడతార న్నారు. చాలా మంది రిఫ్రిజరేటర్లు వినియోగిస్తుండటంతో మట్టికుండలకు ప్రాధాన్యత తగ్గిందని ఆయా కుటుంబాలు వారు తెలియచేశారు. కులవృత్తిపైనే ఆధారపడిన మాబోటి వారు మాత్రమే ఇప్పటికీ కుండలు తయారు చేస్తున్నట్లు చెప్పారు.

జీవాలకు టీకాలు వేయించండి



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కొత్తచెరువు: వ్యాధులు ప్రబలకుండా జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఏడీ మల్లేష్ పటేల్ తెలిపారు. కొత్తచెరువులో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 వరకూ టీకాలు మండల వ్యాప్తంగా వేయనున్నట్లు తెలిపారు. పశువుల్లో తీవ్రమైన జ్వరం, పాల ఉత్పత్తి తగ్గడం, నోటిపుళ్లు తదితర వ్యాధుల బారి నుంచి పశువులను రక్షించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్రమం చేపట్టిందన్నారు. మండల వ్యాప్తంగా 3 నెలలు పైబడిన అన్ని పశువులకు టీకాలు వేస్తున్నట్లు ఏడీ తెలిపారు.

నల్లచెరువు: పాడి రైతులు తమ పశువులకు టీకాలను వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున తెలిపారు. మండల పరిధిలోని కే. పూలకుంటలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలోనూ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారి రామచంద్ర, ప్రాంతీయ పశువైద్య ఆసుపత్రి సహాయ సంచాలకులు శివప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అత్యవసర సేవలకు '1962'

బత్తలపల్లి: పశువులకు అత్యవసర సమయాల్లో 1962 నంబర్‌కు కాల్ చేస్తే పశువైద్య సంచార చికిత్సా వాహనం ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తుందని ధర్మవరం డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోడేకండ్ల గ్రామంలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు పైబడిన దూడలతో సహా పశువులన్నింటికీ టీకాలు వేయించాలని కోరారు. అనంతరం 198 పశువులకు టీకాలు వేయించారు. గురువారం ఈదుల ముష్టూరు గ్రామంలో టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి గంగిరెడ్డి



మానవహారం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

బత్తలపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గంగిరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంపై సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు గంగిరెడ్డి, నిఖిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్‌సీ రాజశేఖర్, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ, నారమ్మ, విలేజ్ క్లినిక్ సీహెఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, మేల్ హెల్త్ అసిస్టెంట్‌లు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి రాజేంద్ర ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భేటీ బచావో భేటీ పడావోపై సమీక్ష సమావేశం చేపట్టారు. సిబ్బందితో కలిసి ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళల ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, దిశ, పోక్సో చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరస్వతమ్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ప్రేమతో ఆదరించాలి

తాడిమర్రి: ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రేమతో ఆదరించాలని ఎంఈఓ కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఆయన సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ద్వారా వచ్చిన రోలేటర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధిమాంద్య చిన్నారుల పట్ల కరుణ, జాలి, దయ కలిగి ఉండాలన్నారు. వారిని సకలాంగులుగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. సక్రమంగా నడవలేని వారికి రోలేటర్ పట్ల అవగాహన కల్పించి నడిపించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగన్మోహన్, ఐఈఆర్టీలు బొల్లికొండ మాధవ, జీవతర్నం, సీఆర్పీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం'



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం

నల్లమాడ: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమణప్ప తెలిపారు. ఇందుకోసం రాత్రివేళల్లో పదో తరగతి విద్యార్థులుండే గ్రామాలకు ఉపాధ్యాయులతో కలిసి వెళ్లే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. తొలిరోజు కుటాలపల్లిని సందర్శించినట్లు తెలిపారు. రోజూ రాత్రివేళల్లో ఓ గ్రామానికి వెళ్లి ఆ గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల అవగాహన కల్పించి వారిలో భయం పోగొట్టడం, పాఠ్యాంశాల్లో వారికి ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేయడం, తల్లిదండ్రులకు తగు సూచనలు, సలహాలిస్తున్నట్లు హెచ్ఎం రమణప్ప వివరించారు.

నేత్రదానం



నేత్రాలను సేకరిస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన డాక్యుమెంట్ రైటర్ జింకా శ్రీనివాసులు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు బుధవారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఒప్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ టెక్నీషియన్ ప్రదీప్ మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేసిన మృతుని భార్య పార్వతి, కుమారుడు మోక్షిత్, కుమార్తె మోనిక, కుటుంబ సభ్యులు బాబు, జింకా కేశవనారాయణలకు విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్, మాధవ, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, బాబు, నాగార్జున, కేశవరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

అరుణాచలంకు స్పెషల్ బస్సు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు స్పెషల్ బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనోద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు 6వ తేదీ (సోమవారం) రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ.860 చార్జీ ఉంటుందన్నారు. ముందస్తుగా టికెట్టును బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో పొందవచ్చన్నారు. ఫోన్‌పేతో టికెట్ కొనుగోలు చేసేవారు 9398111522 నంబరుతో టికెట్ తీసుకోవచ్చని సూచించారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



బత్తలపల్లిలో పొలం వద్దకు వెళ్లి నగదు అందజేస్తున్న వలంటీర్ కాటమయ్య



ఆస్పత్రిలో ఖాజామొహిద్దీన్‌కు పింఛన్ అందజేస్తున్న సంక్షేమ అధికారిణి వెంకటేశ్వరి

బత్తలపల్లి: మండలంలో బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. కొందరు వలంటీర్లు తెల్లవారుజాము 4 గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. మండలంలో సామాజిక పింఛన్లు మొత్తం 6,262 ఉన్నాయి. సాయంత్రం 4 గంటలకు 4,864 మందికి పంపిణీ చేసి 78 శాతం, పనులకు వెళ్లి వచ్చిన వారికి పంపిణీ చేయగా రాత్రికి 90 శాతంపైగా లబ్ధిదారులకు సాయం అందించడం గమనార్హం. ఆస్పత్రిలో, ఉపాధి పనుల వద్ద, పొలాల వద్దకు వెళ్లి పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

మంచానికి పరిమితమైన వ్యక్తికి..

ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన హరి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శరీరం మొత్తం చచ్చుపడిపోయి మంచానికి పరిమితం కావడంతో ఆయనకు రూ.5 వేలు పింఛన్ అందించామని వార్డు కౌన్సిలర్ కత్తె ఆదిలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ కత్తె పెద్దన్న తెలిపారు. హరి సమస్యను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పింఛను వచ్చేలా కృషి చేశారు. దీంతో పింఛనును బుధవారం ఆయన ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మమత, ఏఎన్ఎం అనిత, వలంటీర్ కుబ్రలు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి అందజేత

నల్లమాడ: మండలంలోని పులగంపల్లికి చెందిన పింఛన్ లబ్ధిదారుడు ఖాజామొహిద్దీన్ అనారోగ్యంతో కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ సచివాలయ సంక్షేమ అధికారిణి వెంకటేశ్వరి 15 కిలోమీటర్ల దూరంలోని కదిరి పట్టణానికి సొంత ఖర్చులతో వెళ్లి లబ్ధిదారునికి వృద్ధాప్య పింఛన్ అందజేశారు. దీంతో లబ్ధిదారుడు అధికారిణికి కృతజ్ఞతలు తెలిపాడు.

అవాంతరాలెదురైనా ఒకటో తేదీనే డబ్బు



కిడ్నీ బాధితురాలికి పింఛన్ అందిస్తున్న ఎంపీపీ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఒకటో తేదీనే పింఛన్‌దారులకు వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుడ్డంపల్లిలో నవ్యదీప్తి అనే యువతి కిడ్నీవ్యాధితో బాధపడుతోంది. డయాలసిస్ కోసం నూతనంగా మంజూరైన రూ.10 వేలు పింఛన్‌ను బుధవారం ఆయన బాధిత మహిళకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో రెండేళ్ల పాటు రాష్ట్రం అతలాకుతలం అయ్యిందన్నారు. ఆదాయం వనరులు, ఆదాయం కోల్పోయి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి పోయిందన్నారు. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను నిరవధికంగా నడిపిస్తున్నారన్నారు. మండలంలో ప్రతినెల 6004 మంది పింఛన్‌దారులకు రూ.1,64 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాజేంద్ర, సంక్షేమ సహాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బు తిరిగి అందజేత



బాధిత మహిళకు పర్సు అందజేస్తున్న పోలీసులు

బత్తలపల్లి: కొండకమర్లకు చెందిన శివమ్మ మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో గల బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చింది. బుధవారం తిరుగు ప్రయాణంలో తన సోదరితో కలిసి ఆటోలో బత్తలపల్లికి వచ్చింది. ఆ సమయంలో తన వద్దనున్న పర్సును పోగొట్టుకుంది. అందులో రూ.8 వేలు ఉండడంతో ఆందోళన చెందింది. వెంటనే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆంజనేయులు, మన్సూరు ఇలాహీ,సుదర్శన్‌నాయుడులకు తెలపగా, ఆటో దిగిన ప్రదేశంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని విచారించారు. బత్తలపల్లికి చెందిన ఎరుకల గంగమ్మకు పర్సు దొరికినట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే గంగమ్మ ఇంటి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఆమె పర్సును, నగదును అందజేశారు. వాటిని బాధిత మహిళకు నిమిషాల వ్యవధిలోనే అందజేయడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ధర్మవరం అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసమే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించామని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మల జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మలు తెలిపారు. స్థానిక కాకతీయ విద్యానికేతన్‌లో రెండు రోజులపాటు జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు పలు నమూనాలను తయారు చేసి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ప్రతిఏటా జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించి వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' విలేకరిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

కనగానపల్లి: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆంధ్రజ్యోతి విలేకరి ఆంజనేయులును కఠినంగా శిక్షించాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు కనగానపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. గౌరవప్రదమైన విలేకరి వృత్తిలో ఉంటూ ఇటువంటి సంఘటనకు పాల్పడటం దారుణమన్నారు. పోలీసులు వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకుని సరైన శిక్ష విధించాలన్నారు. ఇక ఇటువంటి వారిని ప్రోత్సహిస్తూ నిందితులకు అండగా నిలుస్తున్న పరిటాల కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని, డైరక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ రాజేశ్వరీ, ఆంకె అశోక్, బి.రవి, అనిల్, నారాయణరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసులు, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతికి ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: తెలంగాణ రాష్ట్రంలోని కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతీ నాయక్ మృతికి సంతాపం తెలుపుతూ బుధవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. ప్రీతి చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించి కొవ్వొత్తుల పదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు గోపాల్‌నాయక్, ఆదినారాయణనాయక్,రమేష్‌నాయక్, టైలర్ నిజాం తదితరులు మాట్లాడుతూ ప్రీతి నాయక్‌ను వేధించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు గోవిందు, డిజిటల్ అసిస్టెంట్ చౌడప్ప, ఉపాధ్యాయుడు నాగరాజు, మాజీ ఎంపీటీసీ మహబూబ్‌బాష, నాయకులు రామాంజినేయులు, సుధాకర్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.